క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరికలు



చిన్నంబావి: మండల కేంద్రంలోని బెక్కం, గూడెం గ్రామాలకు చెందిన 15 మంది యువకులు నియోజకవర్గ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి సమక్షంలో బుధవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ యువతకు సముచిత స్థానం కల్పిస్తుందని, యువకులు రాష్ట్ర అభివృద్ధిలో పాలు పంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో శివప్రసాద్, గోపాల్, హరికృష్ణ, ఆంజనేయులు, సుధాకర్, మహేష్, జానకి, లక్ష్మి, నారాయణ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి సమీపంలో గల శ్రీదత్త కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న కోటిలింగాల ప్రతిష్ఠ, ధ్యాన కేంద్రం, పంచలోహ లింగం నిర్మాణం కార్యక్రమంలో భాగంగా వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన కీర్తన, వినోద్‌కుమార్ దంపతులు తమ వంతు విరాళంగా రూ.27,116 విరాళంగా ఆలయ నిర్వాహకుడు శేఖరయ్యకు అందజేశారు. ఆలయంలో జరుగుతున్న పుణ్య కార్యక్రమాలకు దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేయాలని నిర్వాహకులు కోరారు.

రూ.మూడు లక్షలు మంజూరు



అమరచింత: మండలంలోని పాంరెడ్డిపల్లిలో వాల్మీకి సంఘం భవన నిర్మాణానికి జెడ్పీ నిధుల నుంచి రూ.మూడు లక్షలు జెడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి మంజూరు చేశారని జెడ్పీటీసీ మార్క్ సరోజ తెలిపారు. జెడ్పీ కార్యాలయంలో గ్రామానికి చెందిన నాయకులకు జెడ్పీచైర్మన్ దీనికి సంబంధించిన ప్రొసీడింగ్‌ను అందించారన్నారు. కమ్యూనిటీ భవనం కోసం మరోమారు నిధులు మంజూరు చేస్తామని, మొదటగా మంజూరు చేసిన నిధులతో పనులు ప్రారంభించాలని సూచించారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం గ్రామ అధ్యక్షుడు ప్రభాకర్, మార్క వెంకటయ్య, బండి వెంకటరెడ్డి, కదుమూరు రాములు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు



అమరచింత: పట్టణంలోని పదో వార్డులోని జీఎస్ భవనం ఎదుట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో వెంటనే వాటిని మరమ్మతుకు పంపి విద్యుత్ అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నామని మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి తెలిపారు. బుధవారం తెల్లవారుజామున ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో వెంటనే లైన్‌మెన్ రాజుకు సమాచారం అందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆత్మకూర్‌కు తరలించామన్నారు. వెంటనే మరమ్మతు చేపట్టి కాలనీవాసులకు విద్యుత్ అంతరాయం కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. పట్టణంలోని ఆయా వార్డులో విద్యుత్ అంతరాయ సమస్యలు నివారించేందుకు ఎప్పటికప్పుడు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.

పరామర్శ

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన అశ్విని శంకర్(55) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. సేనాపతి, రాంచంద్రయ్య, పురుషోత్తంరెడ్డి, పుల్లన్న ఉన్నారు.

మదనాపురం: మండలంలోని నర్సింగాపురం గ్రామానికి చెందిన రైతు గుజ్జుల రాములు బుధవారం మృతి చెందారు. రైతుబంధు మండల అధ్యక్షుడు హనుమాన్‌రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సహకారంతో రైతుబీమా రూ.5 లక్షలు వెంటనే అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ, నర్సింహాగౌడ్, హరికృష్ణ, ఎర్ర నాగన్న ఉన్నారు.



ఎడతెరిపి లేని వర్షాలు

పాన్‌గల్: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వివిధ గ్రామాల రైతులు వరి నాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేయడంతో పాటు వరి నాటు వేస్తున్నారు. మంగళవారం రాత్రి, బుధవారం కురిసిన వర్షం దాటికి పలు గ్రామాల్లో ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాన్‌గల్ పోలీస్ స్టేషన్ ఎదుట వర్షపు నిలవడంతో లోపలికి వెళ్లేందుకు పోలీసులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో గౌస్‌మోహినోద్దీన్‌కు చెందిన ఇల్లు, అన్నారంలో స్వామికి చెందిన ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. గ్రామాల్లో పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండటంతో పారిశుద్ధ్యం లోపించడంతో పాటు డ్రెయినేజీల్లో చెత్త చేరి మురుగు రోడ్లపై పారుతోంది.

కొత్తకోట రూరల్: మండలంలో కురుస్తున్న ముసురు వర్షాలకు రైతులు జోరుగా వరి నాటు వేస్తున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి వరి నాట్లు నీటిలో మునిగిపోయాయి. వర్షం తగ్గుముఖం పడితే గానీ వరిచేళ్లు కోలుకోవని రైతులు వాపోతున్నారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని కడుకుంట్లలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి మూడు మట్టి మిద్దెలు కూలిపోయాయని తహసీల్దార్ రాజేందర్‌గౌడ్ తెలిపారు. గ్రామానికి చెందిన గోపాలకృష్ణగౌడ్, మంద పెబ్బేటి చిన్నబాల, తెలుగు బ్యాండ్ సాయిల్ మట్టిమిద్దెలు వర్షానికి కూలిపోయాయి. ఇళ్లు కూలే సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. వర్షాలకు మట్టి మిద్దెలో నివసించే వారు జాగ్రతగా ఉండాలని అధికారులు సూచించారు.

గోపాల్‌పేట: ముసురు వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి మండలంలో మొత్తం పది ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని గోపాల్‌పేట, రేవల్లి మండలాల తహసీల్దార్లు సునీత, శ్రీరాములు తెలిపారు. తల్పునూరులో రెండు, చెన్నారంలో రెండు, నాగపూర్‌లో ఒక ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని రేవల్లి తహసీల్దార్ శ్రీరాములు చెప్పారు. అలాగే గోపాల్‌పేటలో మూడు ఇళ్లు, పొలికెపాడులో ఒకటి, మున్ననూరులో ఒక ఇల్లు కూలిపోయిందని తహసీల్దార్ సునీత పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన మంగదొడ్డి కృష్ణ ఇంట్లో ఆయన భార్య, నలుగురు పిల్లలు మంగళవారం రాత్రి ఇంటి ముందు ఉన్న రేకుల్లో నిద్రపోయారు. అర్ధరాత్రి సగం ఇల్లు కూలింది. దీంతో కుటుంబ సభ్యులకు పెద్ద ప్రమాదం తప్పింది.

చిన్నంబావి: మండలంలోని అయ్యవారిపల్లి, కొప్పునూరు, పెద్దదగడ గ్రామాల్లో తొమ్మిది ఇళ్లు కూలిపోయాయి. ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, వివరాలను కలెక్టర్‌కు నివేదిక అందించామని తహసీల్దార్ ఝాన్సీరాం నాయక్ తెలిపారు.



కానాయపల్లి శివారులో వరి నాటు వేస్తున్న కూలీలు



కొత్తకోట సమీపంలో నీట మునిగిన వరి పంట



కడుకుంట్లలో వర్షానికి కూలిన మట్టిమిద్దె



కొప్పునూరులో కూలిన మట్టిమిద్దె

ఇంటింటికీ పండ్ల మొక్కల పంపిణీ



రామన్‌పాడు వద్ద మొక్కలు నాటుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



అన్నారంలో మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్, కార్యదర్శి

పాన్‌గల్: మండలంలోని అన్నారంలో సర్పంచ్ రాములు, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు బుధవారం ఇంటింటికీ పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జామ, దానిమ్మ, బొప్పాయి, మందార వంటి మొక్కలను ఒక్కొక్కరికి ఆరు మొక్కల చొప్పున అందజేసినట్లు వారు పేర్కొన్నారు. తీసుకున్న మొక్కలను ఇంటి ఆవరణల్లో పెంచాలని కోరారు. దీంతో పాటు హరితహారంలో గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా నాటే మొక్కలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా కాపాడాలని సూచించారు.

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు ప్రాజెక్టు సమీపంలో బుధవారం ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ కృష్ణయ్య మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ మొక్కలు నాటడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కురుమూర్తి, ఎంపీటీసీ సరస్వతి, ఎంపీడీఓ నాగేంద్రం, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బిట్లె యాదగిరి, కో ఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, టీసీ నాగన్నయాదవ్, మార్కెట్ డైరెక్టర్ వెంకటేశ్‌యాదవ్, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వనపర్తి టౌన్: కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మట్టి మిద్దె ఇళ్లు ఉన్న వారు, ముంపుకు గురయ్యే ప్రాంతంలో నివసంచే ప్రజలు సురక్షితమైన ప్రాంతాలకు వెళ్లాలని మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ అన్నారు. వర్షాలు భారీ నుంచి అతి భారీగా కురిసే అవకాశాలు ఉన్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ అధికారులు కాలనీలు పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కొన్ని అంతర్గత రహదారులపై వర్షం నీరు నిలుస్తుందని, వాహనదారులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఖిల్లాఘనపురం: రాష్ట్ర వ్యాప్తంగా రానున్న రెండు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శ్రీహరి సూచించారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రజలు అవసరముంటేనే తగు జాగ్రత్తలతో బయటకు రావాలన్నారు. పిల్లలు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాలు నిరంతరం కురుస్తున్నందున దారిలో ఉండే విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దని కోరారు.

‘మణిపూర్’ బాధ్యులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న స్వేరోస్ రాష్ట్ర కన్వీనర్ కిరణ్

పాన్‌గల్: ఈశాన్య ప్రాంతంలోని మణిపూర్ రాష్ట్రంలో జరిగిన హింసాత్మక ఘటనకు కారణమైన బాధ్యులను కఠినంగా శిక్షించాలని స్వేరోస్ రాష్ట్ర కన్వీనర్ కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద స్వేరోస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర్య భారతదేశంలో పట్టపగలు మహిళలను వివస్త్రలను చేసి నడిరోడ్డుపై ఊరేగించుకుంటూ యావత్ సమాజం తలదించుకునేలా జరిగిన ఈ చర్యల అత్యంత హేయమన్నారు. మైతేయి, కుకీ తెగల మధ్య జరిగిన ఘర్షణలు తారస్థాయికి చేరి విచక్షణ రహితంగా మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలకు పాల్పడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొద్దు నిద్రలో ఉన్నాయని మండిపడ్డారు. ఓటు బ్యాంకు రాజకీయాలు చేసినంత కాలం భారతదేశంలో తెగలు, కులాలు, మతాల మధ్య ఈ రకమైన ఘర్షణలు, విబేధాలు కొనసాగుతూనే ఉంటాయని దుయ్యబట్టారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చొరవ తీసుకొని నిందితులను కఠినంగా శిక్షించి మహిళలకు భద్రత కల్పించాలన్నారు.

ఎరుకల వర్గీయులు అన్ని రంగాల్లో రాణించాలి

ఖిల్లాఘనపురం: ఎరుకలు విద్య, రాజకీయ రంగాలతో పాటుగా అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర ఎరుకల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎల్సరి కృష్ణయ్య, జిల్లా అధ్యక్షుడు బాలస్వామి అన్నారు. బుధవారం ఖిల్లాఘనపురం మండల కేంద్రంలో ఎరుకల సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ఎరుకలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. ఎస్టీ జాబితాలో ఇతర కులస్తులను చేర్చొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో పందులు పెంచుకుంటున్న వారిపై దాడులు చేయడం సరైనది కాదన్నారు. ప్రత్యామ్నాయం చూపకుండా పందులను తొలిగించాలని చెప్పడం బాధాకరమని వాపోయారు.అనంతరం ఆయన అధ్యక్షతన మండల ఎరుకల సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా రాగిరి అంజనేయులు, అధ్యక్షుడిగా రాగిరి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు హన్మంతు, ముద్దని నర్సింహ, ప్రధాన కార్యదర్శి సోళీపురం కృష్ణయ్య, కోశాధికారి సిలుమూర్తి విష్ణు తదితరులను నియమించారు. కార్యక్రమంలో అంజనేయులు, శివకుమార్, తిరుపతయ్య, శ్రీనివాసులు, కృష్ణయ్య, హన్మంతు, లక్ష్మి, ఎల్లమ్మ, అంజనేయులు, పోషన్న తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



వనపర్తి టౌన్: రచయితలకు సామాజిక బాధ్యత అవసరమని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని రేడియంట్ హై స్కూల్‌లో ‘కనెక్టివ్ మిషన్ ఆఫ్ నేషన్స్’ అనే పుస్తకాన్ని ఆవిష్కరించి, పుస్తక రచయిత డాక్టర్ షఫీక్ అహ్మద్‌ను సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా జీవనంలో ఉన్న ప్రతి పౌరుడు సమాజ, దేశ అభివృద్ధికి ఎలా పనిచేయాలో 24 అంశాలతో 16భాషల్లో పుస్తకాన్ని ప్రచురించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళా వేదిక ప్రతినిధులు బైరోజు చంద్రశేఖర్, బండారు శ్రీనివాస్, రాములు, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, గణేష్, రాజేంద్రప్రసాద్, ఆజాం, షఫీ, రాజ్‌కుమార్, మద్దిలేటి రాణి, నాగమణి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

నాసిరకంగా బ్రిడ్జి నిర్మాణ పనులు



కొంకన్‌వానిపల్లి, మద్దురు రహదారిలో వంపులో నిలిచిన నీరు

అమరచింత: మండలంలోని కొంకన్‌వానిపల్లి సమీపంలో మద్దూరు, కొంకన్‌వానిపల్లి రహదారిలో ఉన్న వంపులో నిర్మించిన బ్రిడ్జి నిర్మాణ పనులు నాసిరకంగా ఉండటంతో రాకపోకలు స్తంభించాయి. ఎన్నో ఏళ్లుగా వంపుపై వంతెన నిర్మించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి విన్నవించడంతో రూ.ఐదు లక్షలు మంజూరు చేశారు. వీటి పనుల కోసం ముందుకు వచ్చిన పిన్నంచర్ల వెంకటేష్ అనే కాంట్రాక్టర్ నాసిరకంగా పైపులు వేసి మట్టితో కప్పేయడంతో వరదనీటికి అవి దెబ్బతింది. వర్షపు నీరు వంపు ద్వారా మళ్లీ రహదారిపై పారుతోంది. దీంతో రైతులు, ఆయా గ్రామాల ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పక్షం రోజుల కిందట నాసిరకంగా నిర్మించిన వంతెన పనులపై గ్రామస్తులు రాస్తారోకో నిర్వహించగా వారంలో పనులు పూర్తి చేస్తామని అధికారులు ఇచ్చిన హామీ నీటి మూటలుగా మారాయని సీపీఐ నాయకులు మల్లేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ మండిపడ్డారు. నాసిరకంగా పనులు నిర్వహించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవడమే కాకుండా బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.పది లక్షలు మంజూరు చేసి, వెంటనే పనులను చేపట్టాలని, లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కేసీఆర్ పాలనలో దళితులపై దాడులు

ఖిల్లాఘనపురం: ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో దళితులపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు శివశంకర్ ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఇటీవల నల్గొండ జిల్లాలో దళిత మహిళపై దాడి హేయమన్నారు. దళిత మహిళ శారదను కులం పేరుతో దూషించి దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దళితుల భూములను అధికార పార్టీ నాయకులు కబ్జా చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. అడ్డువచ్చిన వారిని చంపేస్తామని బెదిరిస్తున్నారన్నారు. ఇలాంటి సంఘటనలను బీజేపీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు శివ, అంజనేయులు, ఓబీసీ మోర్చా నాయకుడు ఆశన్న, ఉపాధ్యక్షుడు రాంచందర్, వెంకటేష్ పాల్గొన్నారు.

హక్కులు కల్పించాలని వినతి



వివరాలు సేకరిస్తున్న అధికారులు

ఆత్మకూర్: మున్సిపాలిటీ కేంద్రంలోని బీసీ కాలనీలో ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న తమకు పూర్తి హక్కులను కల్పించాలని లబ్ధిదారులు కలెక్టర్‌కు విన్నవించారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 58, 59 ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాలపై హక్కులను కల్పించేందుకు బీసీకాలనీకి చెందిన మాల వెంకటేష్, ఖాజన్న దరఖాస్తు చేసుకున్నారు. బుధవారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్ బృందం కాలనీలో విచారణ చేపట్టారు. వారసులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలుగా జీఓలు విడుదల అయ్యాయని, దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో డీటీ చాణక్య, ఆర్ఐ నర్సింహులు, వీఆర్ఏ శ్రీనివాసులు ఉన్నారు.

పేదలకు కేటాయించిన స్థలంలో ఇళ్లు నిర్మించాలి



ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని సర్వే నంబర్ 34 భూమిలో పేదలకు కేటాయించిన స్థలంలో వారు ఇళ్లు నిర్మించుకునేందుకు సహకరించాలని ఎంపీటీసీ ఎల్లస్వామి, బీఎస్పీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు బుధవారం బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 34లో 3.20 గుంటల భూమిని ప్రైవేటు వ్యక్తుల నుంచి ప్రభుత్వం 1984లో కొనుగోలు చేసి, గ్రామానికి చెందిన పేద దళితులకు ఇళ్లు కట్టుకోవడానికి ప్లాట్లు కేటాయించారు. అప్పట్లో కొంతమంది గృహాలు, గుడిసెలు నిర్మించుకున్నారు. కొన్ని ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. ఖాళీగా ఉన్న పాట్లలో ఇళ్లు నిర్మించుకోవడానికి వెళ్తే, భూమి తమదని కొందరు వ్యక్తులు వారికి ఆటంకాలు కలిగిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఆ భూమిని అప్పట్లో ప్రభుత్వం కొనుగోలు చేసి, రెవన్యూ రికార్డులో భూయజమాని పేరు తొలగించలేదని ఆయన వివరించారు. రెవెన్యూ శాఖ పరంగా జరిగిన తప్పిదాన్ని గ్రహించిన రాష్ట్ర అధ్యక్షుడు ఈ విషయాన్ని ప్రభుతం దృష్టికి తీసుకెళ్లి దళితులకు న్యాయం చేస్తానని వారికి హామీ ఇచ్చారు.

బోయలకు ‘వాల్మీకిబంధు’ ఇవ్వాలి

ఆత్మకూర్: వాల్మీకులు అన్ని రంగాల్లో వెనుకబడ్డారని, వారికి వాల్మీకిబంధు ఇవ్వడంతో పాటు ఎస్టీ జాబితాలో చేర్చి సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వాల్మీకి బోయ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మండ్ల రామకృష్ణ డిమాండ్‌చేశారు. బుధవారం ఆత్మకూర్‌లోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పార్లమెంట్ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లును ఆమోదించి వాల్మీకులకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సింధూజకు అందజేశారు. కార్యక్రమంలో మండ్ల విజయ్, కావలి వెంకటన్న, ఎస్టీడీ శ్రీను, కొత్తబోయ శేఖర్, సద్దల వెంకట్, రాజు, ఎల్లన్న, నరేందర్, కావలి రఘు, సూరి, కురుమూర్తి, శ్రీనివాసులు, రాము, రాజశేఖర్, ఖాజన్న తదితరులు ఉన్నారు.

ఎస్టీ జాబితాలో చేర్చాలి

ఖిల్లాఘనపురం: రాష్ట్రంలోని వాల్మీకి బోయ, వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు దాసర్ల భూమయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వడ్డెరులు, వాల్మీకి బోయల సమావేశం నిర్వహించారు. మంగళవారం ఎంపీ లక్ష్మణ్ రాజ్యసభలో మాట్లాడుతూ రాష్ట్రంలోని వడ్డెరులు, వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని, వీరు ఇతర రాష్ట్రాల్లో ఎస్టీ జాబితాలో ఉంటే తెలంగాణలో బీసీ జాబితాలో ఉన్నారని మాట్లాడటంపై వారు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కావలి అంజనేయులు, వడ్డె మల్లేష్, బోయ వెంకటయ్య, వావలి అయోధ్య, కుర్మయ్య, కృష్ణయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

అమర జవాన్లకు నివాళి

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో బుధవారం కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో అమర వీరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి హాజరైన జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్, గోపి మాట్లాడుతూ దేశం కోసం వీరోచితంగా పోరాడిన జవాన్ల సేవలను ఎన్నటికీ దేశం మరవదన్నారు.



ఏఎస్పీకి సన్మానం



వనపర్తి: సుదీర్ఘకాలంగా జిల్లాలో పలు హోదాల్లో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఏఎస్పీ షాకీర్ హుస్సేన్‌ను బుధవారం పలువురు నేతలు శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు గులాం ఖాదర్‌ఖాన్, నీలస్వామి, ఎండీ రహీం, అఫ్జలుద్దీన్, ఎండీ అనీస్ తదితరులు ఉన్నారు.

వినూత్నంగా పంచాయతీ కార్మికుల నిరసన



శ్రీరంగాపురంలో కార్మికులకు మద్దతు తెలుపుతున్న రాజేంద్రప్రసాద్



కొత్తకోటలో చెట్ల ఆకులు తింటూ నిరసన తెలుపుతున్న కార్మికులు

కొత్తకోట: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరిచాలంటూ కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారం 21వ రోజుకు చేరింది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మికులు చెట్ల ఆకులు తింటూ వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులు గ్రామాలను వదిలి మండల కేంద్రంలో సమ్మె చేస్తున్నా.. నేటికీ ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడం దురదృష్టకరమన్నారు. అశోక్, రాములు, భాస్కర్, కరీం, తిరుపతయ్య, గోపాల్, వెంకటేష్, కృష్ణయ్య, సాయిలు ఉన్నారు.

పాన్‌గల్: డిమాండ్ల సాధన కోసం పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి కార్మికుల డిమాండ్లను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని కోరారు. కార్యక్రమంలో రాము, కార్మికులు పాల్గొన్నారు.

మదనాపురం: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు బుధవారం వర్షంలోనే నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పరశురాం, సహదేవుడు, కరీం, మధు, గట్టన్న, శ్రీనివాసులు, ఖాదర్, ప్రదీప్, హోసన్న, అంజి, రాములు, శాంతన్న తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు కాంగ్రెస్ మద్దతు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్ యాదవ్ బుధవారం సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో రాముడు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కుమ్మరి గోవిందు, శ్రీను, గంగాధర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.